క్లుప్తంగా

తిమ్మాపురం ఎస్సైగా గణేష్‌కుమార్



కాకినాడ రూరల్: తిమ్మాపురం ఎస్సైగా యర్రంశెట్టి గణేష్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పోర్టు పీఆర్వోగా పనిచేసిన గణేష్‌కుమార్ తిమ్మాపురానికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు తిమ్మాపురం ఎస్సైగా పనిచేసిన రవీంద్రబాబు ఇటీవల కోనసీమ జిల్లాకు బదిలీపై వెళ్లారు. గణేష్‌కుమార్‌కు అదనపు ఎస్సై మూర్తి, రైటన్ ఆలీషా, సిబ్బంది స్వాగతం పలికారు. ఎస్‌బీ నుంచి వచ్చానని, లాండ్ అండ్ ఆర్డర్ సమస్యను పరిష్కరించడంతో పాటు బీచ్ సందర్శకులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేస్తానన్నారు. బీచ్ ప్రాంతంలో పార్కింగ్ చేస్తున్న వాహనాలలో విలువైన వస్తువులను సందర్శకులు ఉంచడంతో అవి దొంగతనం అవుతున్నట్టు తన దృష్టికి వచ్చిందని దీనిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

నితీష్ కుటుంబానికి నేతల పరామర్శ

కరప: మండలం గురజనాపల్లికి చెందిన తాతపూడి నితీష్ గోదావరిలో మునిగి మృతి చెందిన నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే పంతం నానాజీ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి తాము అండగా ఉంటామని వారు ధైర్యం చెప్పారు.

రోగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

కాకినాడ సిటీ: మాజీ ఎమ్మెల్యే అనిశెట్టి బుల్లబ్బాయిరెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమార్తె అనిశెట్టి దేవి (రెడ్డమ్మ) బుధవారం కాకినాడ జీజీహెచ్‌లోని లెప్రసీ, క్యాన్సర్, ఐసోలేషన్, చర్మవ్యాధులు తదతర వార్డుల్లోని 500 మంది రోగులకు దుప్పట్లు, పండ్లు పంచిపెట్టారు. బుల్లెబ్బాయి రెడ్డి పేరిట ఫౌండేషన్ ఏర్పాటు చేసి ప్రజలకు సేవ చేయనున్నట్టు ఆమె తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



రైలు ఢీకొని మృతి చెందిన వ్యక్తి

కాకినాడ సిటీ: సామర్లకోట మండలం వీకేరాయపురం రైల్వే పట్టాల మధ్యలో సుమారు 65 సంవత్సరాల వ్యక్తి రైలు ఢీకొని మరణించినట్లు రైల్వే ఎస్ఐ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతి చెందిన వ్యక్తి బ్రౌన్‌కలర్ ప్యాంటు, మొలతాడుకు తావీదు కట్టి ఉందని, చామనఛాయ రంగు కలిగి ఉన్నాడన్నారు. ఎడమ కాలు మడమ తెగి వేలాడుతుందని, కుడికాలు మడమ తెగిపడి ఉందన్నారు. వివరాలు తెలిసిన వారు 94407 02328 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పవచ్చని ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

సామర్లకోట: డిమాండ్ల సాధనకు మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం 22వ రోజు కొనసాగించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంట్రాక్టు కార్మికుల ఆకలి బాధలు తీర్చాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ నెలకు రూ.13 వేలు చేతికి వస్తే తమ కుటుంబాలను పెరిగిన ధరలతో ఎలా పోషించుకోవాలన్నారు. 15 ఏళ్లు దాటి పని చేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని, విధి నిర్వహణలో చనిపోతే రూ.10 లక్షలు, అంగవైకల్యం చెందితే రూ.ఐదు లక్షల నష్ట పరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, స్కిల్ వర్కర్లకు రూ.29,200, నాన్ స్కిల్ వర్కర్లకు రూ.24,500 కార్మిక చట్టం ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సెలవులు వర్తింప చేయాలనే కొరుతూ సమ్మె చేస్తున్నట్టు తెలిపారు. గతంలో ఏడు నెలల క్రితం సమ్మె చేయగా సమస్యలు పరిష్కరిస్తామని సీడీఎంఏ హామీ ఇచ్చి ఇప్పటి వరకు సమస్యలు పరిష్కరించక పోవడంతో ఈ నెల 7వ తేదీ నుంచి సమ్మె ప్రారంభించినట్లు కార్మిక సంఘ నాయకులు తెలిపారు.

ఎన్టీఆర్‌కు నివాళులు



గొర్రిపూడిలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

కరప: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరం వద్ద ఎన్‌టీఆర్ విగ్రహానికి ఎంపీడీఓ అనుపమ, సిబ్బంది నివాళులు అర్పించారు. వివిధ గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు చంద్రు వెంకన్నారావు, గండి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తట్టు తేలకుండా!

- వ్యాధి అంతమే లక్ష్యంగా వ్యాక్సినేషన్ డ్రైవ్
- మూడు నెలల పాటు మూడు దశల్లో పంపిణీ
- కార్యాచరణ చేపట్టిన వైద్య ఆరోగ్య శాఖ



కాకినాడ అర్బన్ పరిధిలో వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కాకినాడ క్రైం: మీజిల్స్–రుబెల్లా (తట్టు వ్యాధి) వ్యాక్సినేషన్ డ్రైవ్ మొదలైంది. ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని జోరుగా నిర్వహిస్తున్నారు. కాకినాడ అర్బన్, రూరల్ పరిధిలో ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డీఎంహెచ్‌వో, డీఐవోల ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్నారు. అందుకు సర్వే ద్వారా పిల్లల్ని గుర్తించారు. క్షేత్రస్థాయి సర్వేలో గుర్తించిన పిల్లల్ని వయసుల వారీగా విభజించి దశలవారీగా వ్యాక్సిన్ వేయనున్నారు. ఈ బాధ్యతలను డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ పర్యవేక్షణలో జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి (డీఐవో) డాక్టర్ కెవి.సుబ్బరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

మీజిల్స్–రుబెల్లా...

వైరస్ వల్ల సంభవించే రెండు వ్యాధులు మీజిల్స్, రుబెల్లా. నెలల శిశువుల నుంచి చిన్నపిల్లల్లో ఈ వ్యాధి సోకుతుంది. మీజిల్స్ అనే వైరస్ వల్ల మీజిల్స్ సోకితే, జర్మన్ మీజిల్స్ వల్ల రుబెల్లా సోకుతుంది. భిన్న వేరియంట్లు ఒకే వైరస్ కావడంతో ఈ రెండు వ్యాధుల్ని జంటగా సంబోధిస్తారు. అయితే, వీటి లక్షణాలు భిన్నంగా ఉంటాయి. చిన్న పిల్లలు, గర్భిణులతో పాటు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, రోగనిరోధక శక్తి లోపం ఉన్న వారిపై ఈ వైరస్ ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.

ఎలా వ్యాపిస్తుంది...

దగ్గు, తుమ్ము ద్వారా వచ్చే తుంపర్ల వల్ల ఈ వ్యాధి సోకుతుంది. పాఠశాలలు, డే కేర్ సెంటర్ల వంటి చోట వైరస్ వ్యాప్తికి ఎక్కువ అవకాశం ఉంది. వైరస్ సోకిన వ్యక్తితో సన్నిహితంగా ఉన్నా మీజిల్స్–రుబెల్లా వ్యాప్తి చెందొచ్చు.

ఇలా చేస్తే సరి...

వ్యాధి శిశు దశ నుంచే వ్యాప్తి చెందుతుంది. శిశువుకు 9 నెలల నుంచి 15 నెలల మధ్య ఎంఎంఆర్ (మీజిల్స్, మంప్స్, రుబెల్లా) వ్యాక్సిన్ వేయించుకోవాలి. ఈ వైరస్‌పై నిర్వహించే అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి.

లక్షణాలు–లోపాలు

జ్వరం, తలనొప్పి, ముక్కు కారడం, దగ్గు, కళ్ల ఎర్రదనం, నోటిలో తెల్లటి మచ్చలు, శరీరంపై ఎర్రటి మచ్చలు మీజిల్స్ లక్షణాలు. అలాగే, తేలిక పాటి జ్వరం, గొంతునొప్పి, శరీరంపై గులాబీ రంగు మచ్చలు, మెడచుట్టు లేదా చెవుల చుట్టూ వాపు, ఉబ్బడం రుబెల్లా లక్షణాలు. శిశువుకు శారీరక లోపాలు, శరీర అభివృద్ధిలో లోపాలు ఈ వ్యాధి సోకిన వారు ఎదుర్కొబోయే సమస్యలు.

మూడు నెలలు–మూడు దశలు

కాకినాడ అర్బన్, గ్రామీణాల్లో ఎంఆర్ తొలిదశ వ్యాక్సినేషన్ మొదలైంది. మూడు నెలల పాటు మూడు దశల్లో టీకాల పంపిణీ జరగనుంది. ఈ ఏడాది మే 26 నుంచి 31 వరకు తొలి దశ, జూన్ 23 నుంచి 28 వరకు రెండవ దశ, జూలై 21 నుంచి 26 వరకు మూడో దశ వ్యాక్సినేషన్ జరగనుంది.



అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ రాహుల్ మీనా, డీఆర్‌వో వెంకట్రావు తదితరులు

ఈ ప్రాంతాలే లక్ష్యం...

ఆరోగ్య ప్రయోజనాలు అందిపుచ్చుకోవడంలో వెనుకబడ్డ ప్రాంతాలే లక్ష్యంగా వ్యాక్సినేషన్ ప్రక్రియపై వాల్‌పోస్టర్లు, కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్నారు. వలస స్థలాలు, మురికి వాడలు, సంచార జాతులు, ఇటుకబట్టీలు, నిర్మాణ స్థలాలు, మత్స్యకార ప్రాంతాలు, కార్మిక ప్రదేశాలు, వ్యవసాయ కూలీల నివాస ప్రాంతాలు లక్ష్యంగా టీకా ప్రక్రియను నిర్వహిస్తున్నారు. కాకినాడ పరిధిలో రేచర్లపేట, దుమ్ములపేట, సంజయ్ నగర్, దుమ్ములపేట వంటి ప్రాంతాలను ప్రధానంగా ఎంచుకొని ఆయా ప్రాంతాలలో టీకాపై అవగాహన ముమ్మరం చేశారు. అక్కడ అర్హులైన పిల్లలకు నూరు శాతం టీకా అందేలా ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్వాడీలు శ్రమిస్తున్నారు.

16 ఆరోగ్య కేంద్రాల పరిధిలో

కాకినాడ అర్బన్, గ్రామీణ మండలాల్లో మొత్తం 14 అర్బన్ ప్రైమరీ సెంటర్లు, 2 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొత్తం 16 ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఈ పరిధిలో వ్యాక్సిన్‌ను రెండు దఫాల్లో వేయనున్నారు. అందుకు 9–12 నెలలు, 1–5 ఏళ్లుగా విభజించారు. కాకినాడ గ్రామీణ, అర్బన్ మండలాల్లో 202 మంది 9–12 నెలల వయసున్న పిల్లలు, 31 మంది 1–5 ఏళ్ల పిల్లల్ని వ్యాక్సినేషన్ కోసం గుర్తించారు.

మీ పిల్లల మంచి కోసమే



సర్వే ఆధారంగా టీకాల పంపిణీ చేస్తాం. 9 నెలలోపు వేయాల్సి ఉన్నా అప్పుడు వేయించుకోని పిల్లలు ఎవరైనా ఉంటే 5 ఏళ్ల వయసు లోపు వరకు వేస్తాం. ప్రజల్లో చాలామంది అవగాహన లేక, మీజిల్స్–రుబెల్లాను తక్కువ అంచనా వేస్తున్నారు. ఉనికి తక్కువగా ఉన్నా పూర్తిగా వైరస్ కనుమరుగు కాలేదు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పని సరిగా ఎంఆర్ వ్యాక్సిన్ వేయించండి. ఆశా, ఏఎన్ఎం, అంగన్వాడీలు వంటి క్షేత్రస్థాయి సిబ్బంది తీవ్రస్థాయిలో శ్రమిస్తోంది. లబ్ధిదారులైన చిన్నారులను గుర్తించడంలో వారే కీలకం. అవగాహనే లక్ష్యంగా జేసీ రాహుల్ పోస్టర్‌ను ప్రారంభించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ పర్యవేక్షణలో టీకాల ప్రక్రియ నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ కేవీ సుబ్బరాజు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి (డీఐవో), కాకినాడ

ఆత్మీయ కలయిక



కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలో పార్టీ కేంద్ర కార్యాలయంలో తమ అధినేత జగన్‌ను కలిసినట్టు నాగమణి తెలియజేశారు.

గాంధీ పార్కులో దుర్గంధం

బోట్‌క్లబ్: స్థానిక గాంధీనగర్ పార్కులో సెప్టిక్ ట్యాంక్ నిండిపోయి వ్యర్థాలు బయటకు వచ్చి దుర్గంధం వెదజల్లుతున్నా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని సందర్శకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా ఇదే పరిస్థితి ఉందని అధికారులకు సమాచారం ఇచ్చిన చర్యలు తీసుకోలేదని వాకర్స్ సభ్యులు మండిపడుతున్నారు. ఉదయం సాయంత్రం సుమారు 900 మందికి పైగా సందర్శకులు, వాకర్లు వస్తుంటారు. అటువంటి పార్కులో సదుపాయలు కూడా సక్రమంగా లేవు. పార్కులో చిన్నపిల్లల ఆట వస్తువులు, జిమ్ పరికరాలు మరమత్తులకు గురైనా అధికారులు పట్టించుకోవడం లేదని వారు అంటున్నారు.

ప్రైవేటీకరణతో ప్రతికూల ఫలితాలు

- ప్రభుత్వ వైద్య కళాశాలల్లో వసతులు మెరుగుపరచాలి
- పీ4 విధానాన్ని ఉపసంహరించాలి
- ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు

కాకినాడ సిటీ: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకీకరణ తగదని, రాష్ట్ర ప్రభుత్వం పీ4 విధానం ఉపసంహరించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి కాకినాడ యూటీఎఫ్ టీచర్స్ హోంలో ప్రజారోగ్యవేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య కళాశాలలు–ప్రైవేటీకరణ అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రజారోగ్య వేదిక నగర కన్వీనర్ పి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వ కాలంలో జిల్లాకు ఒక వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని ప్రతిపాదించి ఐదు కళాశాలలను ప్రారంభించారన్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం పీ4 విధానంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయడానికి ప్రయత్నించడం ప్రమాదకరమన్నారు. ఇప్పటికే 70 శాతం వైద్యం, వైద్య పరీక్షలు ప్రైవేటుపరం కావడం వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు అప్పులపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వమే వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తే వైద్యంలో నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. అందు వల్ల ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలు విరమించుకోవాలన్నారు. ప్రముఖ వైద్యుడు గోపీనాథ్ మాట్లాడుతూ ఇప్పటికే ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో సేవలు మెరుగుపరచడానికి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పలువురు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల ప్రైవేటుగా ప్రారంభమై ప్రభుత్వం స్వాధీనం చేసుకుందన్నారు. ఈ పరిస్థితులను ప్రభుత్వం, సంబంధిత అధికారులు గమనించాలన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిలిపివేసి, వాటిలో మౌలిక వసతులు కల్పించాలని, విద్య, వైద్య, ఆరోగ్య రంగాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ కేటాయింపులు పెంచాలని తీర్మానించారు. సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ప్రజాసంఘాల నాయకులు జి.ప్రభాకరవర్మ, కె.సత్తిరాజు, ఎంఎ స్వామి, చంద్రమళ్ల పద్మ, జి.స్వామి నాయుడు, మహ్మద్ ఇబ్రహీం, కేవీవీ నగేష్, జీఎస్ వర్మ, మలక వెంకటరమణ, పద్మనాభం, హరనాధ్, రామకృష్ణ, సూర్యనారాయణ, వెంకటేష్, ఎఆర్‌సి వర్మ, మేడిశెట్టి వెంకటరమణ తదితరులతో పాటు వైద్యులు, వైద్య ఆరోగ్యశాఖల ఉద్యోగులు పాల్గొన్నారు. సమావేశానికి దుంపల ప్రసాద్ ఆహ్వానం పలుకగా పలివెల వీరబాబు వందన సమర్పణ చేశారు.

పాఠశాలలు తెరిచేలోపే స్టూడెంట్ కిట్లు

- ఏపీసీ వేణుగోపాలరావు

కరప: పాఠశాల తెరిచిన రోజు నుంచే విద్యార్థులందరికీ ఉచిత స్టూడెంట్ కిట్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నట్టు జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ) పి.వేణుగోపాలరావు తెలిపారు. బుధవారం ఆయన మండలంలో స్టూడెంట్ కిట్ల స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 21 మండలాల్లో 1280 పాఠశాలలు ఉన్నాయని, ఈ పాఠశాలల్లో 1,28,998 మంది విద్యార్థులు నమోదైనట్టు తెలిపారు. పిల్లలకు పుస్తకాల బరువు తగ్గించేందుకు ఏడాదికి రెండు సెమిస్టర్లుగా పుస్తకాల సంఖ్యను తగ్గిస్తూ తయారు చేశారన్నారు. 1, 2 తరగతులకు సెమిస్టర్‌కు రెండు పుస్తకాలు మాత్రమే ఉండేలా తయారు చేశారు. 3,4,5 తరగతులకు తెలుగు ఆంగ్లం కలిపి ఒక పుస్తకంగా, గణితం పరిసరాల విజ్ఞానం కలిపి ఒక పుస్తకంగా ఉంటాయని. వర్క్ బుక్ కూడా ఇదే విధంగా ఉంటుందన్నారు. 6,7,8,9 తరగతులకు తెలుగు ఆంగ్లం హిందీ కలిపి ఒక పుస్తకంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లాకు మొత్తంగా 6,67,797 పుస్తకాలు వచ్చాయన్నారు. సమగ్ర శిక్ష సీఎంవో చామంతి నాగేశ్వరరావు, ఎంఈఓ పి.సత్యనారాయణ, కరప మండలం స్టాక్ పాయింట్ రిజిస్టర్లను ఏపీసీకి చూపించారు.

గొర్రిపూడిలో మట్టి అక్రమ తవ్వకాలు

కరప: అధికారాన్ని అడ్డుపెట్టుకుని మట్టి మాఫియా కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పేట్రేగిపోతుంది. అంతా మా ఇష్టం.. అడ్డుకునేదెవరన్నట్టుగా టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు బీరాలకు పోతున్నారు. గొర్రిపూడి మురుకోపోర మెరక భూముల్లో మట్టి (బొండు ఇసుక) అక్రమ తవ్వకాలు బుధవారం ప్రారంభించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా తవ్వేసి సొమ్ములు చేసుకుంటున్నారు. దీనిపై గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేయగా తొలుత చర్యలు తీసుకుంటామని తెలిపి, తరువాత మొబైల్ స్విచాఫ్ చేసినట్టు చెబుతున్నారు. మైనింగ్ అధికారులకు సమాచారమిచ్చినా తవ్వకాలు మాత్రం ఆగలేదు. మరోవైపు మట్టి తవ్వకాలపై గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై సునీతను వివరణ కోరగా గొర్రిపూడిలో గొడవ జరుగుతుందని ఫిర్యాదు వచ్చిందని, సిబ్బందిని పంపామన్నారు.

యోగాంధ్రపై విస్తృత ప్రచారం చేయాలి



కరపలో యోగాంధ్ర ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కరప: వచ్చేనెల 21వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నామని, దీనిపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి, యోగాపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఎం.అనుపమ కోరారు. యోగాంధ్ర ప్రచారంలో భాగంగా బుధవారం మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయం, ఉపాధిహామీ పథకం సిబ్బందితో ఏర్పాటు చేసిన యోగాంధ్ర ప్రచార ర్యాలీని ఆమె ప్రారంభించారు. యోగావల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ యోగాసనాలు వేసేలా ప్రజలను చైతన్యపరచాలన్నారు. అనంతరం మండల ప్రజాపరిషత్ కార్యాలయం నుంచి మార్కెట్‌సెంటర్ వరకు యోగాంధ్ర ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారంగా నిలబడి యోగా ప్రాముఖ్యంపై నినాదాలు చేశారు. ఏఓ బీఎల్ నరసింహం, డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ ప్రాంతీయ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న జేవీవీ నాయకులు

కాకినాడ సిటీ: జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల వివిధ స్థాయిల బాధ్యులకు స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం జనవిజ్ఞాన వేదిక సదస్సు నిర్వహించినట్లు వేదిక జిల్లా అధ్యక్షులు కేఎంఎంఆర్ ప్రసాద్ తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో ఉదయం చరిత్రలో సైన్స్ అనే అంశంపై ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ప్రసంగించారు. చరిత్రలో ఏ సందర్భంలో సైన్స్ ఏ విధంగా వ్యవహరించిందో సోదాహరణంగా వివరించారు. మధ్యాహ్నం మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు గేయానంద్ జనవిజ్ఞాన వేదిక నిర్మాణం–కొన్ని ప్రాధాన్యాలపై మాట్లాడారు. జూన్ 1వతేదీ నుంచి జన విజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదులు చేపడతామన్నారు.

ఫుడ్ లైసెన్సు లేకపోవడం నేరం

- జయలక్ష్మి థియేటర్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారి తనిఖీ
- 77 చిప్స్ ప్యాకెట్ల సీజ్



చిప్స్ ప్యాకెట్లను పరిశీలిస్తున్న అధికారులు

సామర్లకోట: ఆహార పదార్థాలు విక్రయించే ప్రదేశాలల్లో తప్పని సరిగా ఫుడ్ లైసెన్సు ఉండాలని ఫుడ్ సేఫ్టీ అధికారి సుబ్బారావు అన్నారు. బుధవారం స్థానిక జయలక్ష్మి థియేటర్ స్టాల్స్‌లో విక్రయిస్తున్న తినుబండారాలను తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఆయన పరిశీలించారు. ఈ మేరకు థియేటర్‌లో ఎటువంటి గుర్తింపు లేని 77 చిప్స్ ప్యాకెట్లను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని పరీక్షలకు పంపుతామని తెలిరు. థియేటర్లలో తప్పని సరిగా ఫుడ్ లైసెన్సు ఉండాలని, అయితే జయలక్ష్మి థియేటర్‌లో ఫుడ్ లైసెన్సు లేక పోవడం నేరమని, దీనికి సంబంధించి కేసు నమోదు చేసి నోటీసు జారీ చేస్తామన్నారు. నోటీసు ఆధారంగా ఫుడ్ లైసెన్సు తీసుకొనే అవకాశం ఇస్తామన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మంగళవారం రాత్రి కలెక్టరు ఆదేశాల మేరకు థియేటర్ తనిఖీ చేసి ఫుడ్ లైసెన్సు లేక పోవడం, ఆన్ బ్రాండెడ్ చిప్స్ విక్రయిస్తున్నట్లు గుర్తించి కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లినట్టు తెలిపారు. దాంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు వచ్చి తనిఖీ చేశారన్నారు. అయితే నాలుగు రోజులుగా థియేటర్‌లో షోలు వేయడం లేదని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో థియేటర్ మేనేజరు వర్రే సతీష్, వీఆర్వో నూతలపాటి లోవరాజు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో యోగా శిక్షణ

- టీఓటీలకు ఇన్‌చార్జి ఎంపీడీఓ భైరవమూర్తి ఆదేశం



యోగా శిక్షణలో పాల్గొన్న సచివాలయ సిబ్బంది

సామర్లకోట: యోగా శిక్షణలో మెళకలను నేర్చుకుని టీఓటీలుగా ఆయా గ్రామాలకు వెళ్లి గ్రామస్తులకు యోగా శిక్షణ ఇవ్వాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ భైరవమూర్తి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మండల పరిధిలోని హుస్సేన్‌పురం, మాధవపట్నం, నవర, పీబీ దేవం గ్రామాలలోని సచివాలయ సిబ్బందికి బుధవారం యోగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21 నాటికి ప్రతి గ్రామంలో యోగా శిక్షణ పూర్తి చేయాలన్నారు. యోగా మాసోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 31 వరకు నిత్యం ఉదయం ఏడు నుంచి 9 గంటల వరకు శిక్షణ ఉంటుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఉదయం, సాయంత్రం యోగాకు సమయం కేటాయించాలన్నారు. విద్యార్థులు, చిన్నారులు చిన్నతనం నుంచి యోగాపై అవగాహన పెంచుకొవడంతో వారిలో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. శిక్షణ పొందిన సిబ్బంది మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ప్రజలకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. యోగాపై ముందుగా అవగాహన ఉండాలన్నారు. ఫిజికల్ డైరెక్టర్ యార్లగడ్డ బంగ్రారాజు, కె.శ్రీనివాసరావు, రవి, జగదాంబ యోగాపై శిక్షణ ఇచ్చారు.

మున్సిపల్ కార్యాలయంలో..

అలాగే మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆధ్వర్యంలో యోగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మెప్మా, మున్సిపల్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్లను విధుల్లోకి తీసుకోవాలి

కాకినాడ సిటీ: జేఎన్‌టీయూకే కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను సాంకేతిక కారణాలతో విధులకు దూరం చేయడం తగదని, వారిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నగరశాఖ డిమాండ్ చేసింది. బుధవారం సీఐటీయూ నగరశాఖ కో కన్వీనర్ పలివెల వీరబాబు విలేకరులతో మాట్లాడుతూ వీసీ సీఎస్ఆర్‌కేతో ఈ విషయమై మాట్లాడామని ఆయన ఎవరినీ విధులకు దూరం చేయబోమని చెప్పినట్టు వివరించారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

పెద్దాపురం: గ్రామీణ యువత క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు అన్నారు. మండలంలోని పులిమేరు గ్రామంలో బుధవారం క్రికెట్ కోర్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ యువత పెడదోవ పడకుండా క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. యువతకు అందుబాటులో క్రీడా పరికరాలు అందించనున్నామని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం క్రికెట్ కోర్టును ప్రారంభించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డైరెక్టర్ శివదత్, నీటి సంఘం ఉపాధ్యక్షుడు జట్ల విజయ్ బాబు, తుమ్మల నాని, జట్లా రాంబాబు, వంగలపూడి దుర్గాజి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అజెండాపై సందిగ్ధం



సామర్లకోట మున్సిపల్ కార్యాలయం

సామర్లకోట: మున్సిపల్ అజెండా తయారీపై అధికారులలో సందిగ్ధత నెలకొంది. ప్రతి నెల కౌన్సిల్ పాలక మండలి సాధారణ సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులపై ఆమోదం తీసుకోవలసి ఉంటుంది. కౌన్సిల్ తీర్మానాలకు లోబడి అధికారులు అభివృద్ధి పనులు చేయాలి. ఈ మేరకు కౌన్సిల్ సమావేశంలో చర్చించాల్సిన అభివృద్ధి పనులపై అజెండా తయారు చేసి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆమోదంతో ఆమె సంతకం చేసిన తరువాత నాలుగు రోజులు ముందుగా కౌన్సిల్ సభ్యులకు అజెండా అందజేయాల్సి ఉంది. అయితే బుధవారం నాటికీ మున్సిపల్ అజెండా తయారు కాలేదు. ఈ అజెండాపై ఎవరి సంతకం తీసుకోవాలనే సందిగ్ధంలో మున్సిపల్ అధికారులు ఉన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యను సాక్షి వివరణ కోరగా సీడీఎంఏ సూచనల మేరకు అజెండా తయారు చేయాల్సి ఉందన్నారు. అజెండా తయారు అంశం సీడీఎంఏ దృష్టిలో ఉంచామని తెలిపారు. సమావేశం నిర్వహణకు సమయం తక్కువగా ఉండటం వల్ల అత్యవసర సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ నెల 31 లోపుగా కౌన్సిల్ సమావేశం నిర్వహించాల్సి ఉంటుందని ఆమె తెలిపారు.